రైతన్నకు దిగుబడి గండం

వరుస తుఫాన్‌లతో అపార నష్టం


పెనుగొండలో ఈనిక దశలో ఉన్న వరి చేను

పెనుగొండ: రైతన్నకు దిగుబడి గండం వెంటాడుతుంది. ఈ సీజన్‌లో వరుస తుపాన్‌లు, భారీ వర్షాలతో నానా తంటాలు పడ్డ రైతన్నలకు దిగుబడులు పై ప్రభావంతో డీలా పడుతున్నారు. ప్రస్తుతం ఈనిక దశలో వరి చేలు ఉన్నాయి. ఇటీవల కురిసిన వర్షాలతో పూత రాలిపోవడంతో గింజ తయారీలో నాణ్యత కొరవడి దిగుబడులుపై ప్రభావం చూపుతుందని అంచనా వేస్తున్నారు. ఆచంట నియోజకవర్గంలో ఆచంట మండలంలో 10,200 ఎకరాల్లోనూ, పెనుగొండ మండలంలో 1100 ఎకరాల్లోనూ, పెనుమంట్ర మండలంలో 13,200 ఎకరాల్లోనూ పోడూరు మండలంలో 11, 400 ఎకరాల్లో వరి సాగు చేస్తున్నారు. వీటిలో 70 శాతానికి పైగా రైతన్నలు ఎంటీయూ 1318 వరి రకం, మిగిలిన రైతన్నలు స్వర్ణ, ఎంటీయూ 1121, పీఆర్ 126 వరి రకాలు వచ్చేసీజన్‌కు విత్తన రకాలుగా సాగు చేస్తున్నారు. ఈ సీజన్‌లో రైతన్నలు ఆది నుంచి ఇబ్బందులు పడుతూనే ఉన్నారు. జూలై నెలాఖరున, సెప్టెంబరు నెలఖారున వచ్చిన రెండు తుఫాన్‌లతోనూ, వరుస వర్షాలు, రెండు మూడు రోజుల పాటు ఏకదాటిగా కురిసిన వర్షాలతో వరి చేలను కాపాడుకోవడానికి నానా ఇబ్బందులు పడ్డారు.

రెండుసార్లు నాట్లు

ఆచంట మండలం వల్లూరు ఆచంట వేమవరం గ్రామాల్లో రైతులు రెండు సార్లు వరి నాట్లు వేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీంతో పాటు నక్కల డ్రెయిన్ పరివాహక ప్రాంతంలోనూ రైతన్నలు ఇదే పరిస్థితిని ఎదుర్కొన్నారు. దీంతో సాగు ఆలస్యం కావడంతో పాటు, ఈనిక దశలో వర్షాలతో పూతపై పరపరాగ సంపర్కం జరగ్గా, గింజ తాలుగా మారే అవకాశం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. దీంతో 20 నుంచి 30 శాతం దిగుబడులు తగ్గే అవకాశం ఉందని వ్యవసాయ శాఖ భావిస్తుంది. ఇదిలా ఉండగా, రాబోయే నెలలో ఎలాంటి తుఫాన్ రాకుండా ఉంటే రైతులుకు కనీసం పెట్టుబడులు మిగులుతాయని, లేదంటే మరోసారి నష్టపోవాల్సి వస్తుందని అంచనా వేస్తున్నారు. తుఫాన్‌లు రాకుండా ఉండాలని కోరుకుంటున్నారు.

నాగరాజుకు ఏఓగా పదోన్నతి

పెనుగొండ: ఆచంట ఇన్‌చార్జి వ్యవసాయాధికారిగా విధులు నిర్వహిస్తున్న బొమ్మిడి నాగరాజు మండల వ్యవసాయాధికారిగా పదోన్నతి పొందారు. దీంతో ఆదివారం ఆచంట శాసన సభ్యుడు పితాని సత్యనారాయణను మర్యాద పూర్వకంగా కలిశారు. ఆచంట మండలానికి నూతన వ్యవసాయ విస్తరణాధికారిగా గుబ్బల నరేష్ కుమార్ నియమితులయ్యారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు ఉప్పలపాటి సురేష్, కేతా మీరయ్య పాల్గొన్నారు.

నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ

నరసాపురం: స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల వ్యవస్థ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు నరసాపురం ఆర్డీఓ దాసి రాజు చెప్పారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ డివిజన్‌లోని అన్ని శాఖల అధికారులు అందుబాటులో ఉంటారని వివరించారు. ప్రజలు తమ ఫిర్యాదులు, దరఖాస్తులు ఉదయం 10.30 గంటలు నుంచి అందించాలని చెప్పారు.

మళ్లీ నిరుపయోగంగా ఓపెన్ ఎయిర్ థియేటర్

- రూ.3.50 కోట్లతో నిర్మాణ పనులు చేపట్టిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వం
- ప్రభుత్వం మారడంతో చివరి దశలో నిలిచిన పనులు



నరసాపురం పాత మున్సిపల్ ఓపెన్ ఎయిర్ థియేటర్ (ఫైల్)


రూ.3.50 కోట్లతో 90 శాతం నిర్మాణం పూర్తి చేసుకున్న ఓపెన్ ఆడిటోరియం

నరసాపురం: నరసాపురం చుట్టప్రక్కల ఇళ్లలో ఏదైనా ఫంక్షన్ చేసుకోవాలంటే బయట ప్రైవేట్ కల్యాణ మండపాల్లో లక్షల్లో ఖర్చు. దీంతో మధ్య తరగతి ప్రజలు పడే ఇబ్బందులు అంతా ఇంతా కాదు. అయితే వైఎస్సార్ సీపీ ప్రభుత్వ వచ్చాక, అప్పటి ఎమ్మెల్యే ముదునూరి ప్రసాదరాజు కృషితో ఆ సమస్యకు, కష్టానికి చెక్ పడే విధంగా అడుగులు వేశారు. నిరుపయోగంగా ఉన్న పట్టణంలోని మునిసిపల్ ఓపెన్ ఎయిర్ థియేటర్‌ను ఓపెన్ ఆడిటోరియంగా అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకున్నారు. దీంతో నరసాపురంలో తక్కువ అద్దె ఖర్చుతో ఫంక్షన్ హాల్ అందుబాటులోకి రావడమే కాకుండా మున్సిపాలిటీకి కూడా ఆదాయం పెరుగుతుందని భావించారు. దాదాపు 90 శాతం పనులు పూర్తయ్యి, పనులు చివరిదశలో ఉండగా ఎన్నికలు రావడం, పనులు నిలిచిపోయాయి.

పట్టించుకోని కూటమి సర్కార్

కూటమి ప్రభుత్వం వచ్చాక ఓపెన్ ఎయిర్ థియేటర్ నిర్మాణ విషయమే పట్టించుకోవడం మానేసింది. వైఎస్సార్ సీపీ హయాంలో మున్సిపల్ ఓపెన్ ఎయిర్ థియేటర్ స్థానంలో రూ 3.50 కోట్లతో మున్సిపల్ ఓపెన్ ఆడిటోరియం నిర్మాణం ప్రారంభమైయ్యింది. పాత భవనాన్ని కూల్చేసి అక్కడ అధునాతన వసతులతో ఓపెన్ ఆడిటోరియం నిర్మాణం దాదాపు పూర్తి చేశారు. మరో 10శాతం చిన్నపాటి పనులు మాత్రమే మిగిలిఉన్నాయి. ఈ పనులు పూర్తయితే ఫంక్షన్స్ చేసుకోవచ్చు.

అప్పుడూ..ఇప్పుడూ అదేతంతు

అందుబాటులో ఎంతో విలువైన స్థలం ఉన్నా కూడా, ఆదాయం పెంచుకునే మార్గంపై గతంలో టీడీపీ హయంలో ప్రజాప్రతినిధులు, అధికారులు దృష్టి పెట్టలేదు. అందుబాటులో ఉన్న విలువైన ఖాళీ స్థలంలో ఓపెన్ ఆడిటోరియం నిర్మించాలని ముదునూరి భావించి ముందడుగు వేశారు. మధ్య తరగతి వారికి తక్కువ ఖర్చుతో ఫంక్షన్స్ చేసుకునే వెసులుబాటు కల్పించే యోచన చేశారు. దానిని కొనసాగించలేక ఇప్పుడు కూడా కూటమి సర్కార్ అదే తప్పు చేస్తుంది.

ఉత్సాహంగా చెకుముకి సైన్స్ సంబరాలు


చెకుముకి సైన్స్ సంబరాల్లో విజేతలతో ఎంఈఓ వీరాస్వామి, జేవీవీ సభ్యులు

పాలకొల్లు సెంట్రల్: సమాజంలో ఎన్నో రంగాలు ఉన్నాయని ప్రతి విద్యార్థి భవిష్యత్‌లో అన్ని రంగాల్లో రాణించే విధంగా పట్టుదలతో కృషి చేసి సమాజానికి సేవ చేయాలని మండల విద్యాశాఖాధికారి 1 గుమ్మళ్ల వీరాస్వామి అన్నారు. ఆదివారం స్థానిక ఎంఎంకేఎస్ మునిసిపల్ ఉన్నత పాఠశాలలో జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో జిల్లా స్థాయి చెకుముకి సైన్స్ సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వీరాస్వామి మాట్లాడుతూ శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకుని మూఢవిశ్వాసాలను పారద్రోలడానికి కృషి చేయాలన్నారు. జిల్లా వ్యాప్తంగా ఈ సంబరాల్లో 34 టీంలు పాల్గొన్నాయన్నారు. భీమవరం పీఎస్ఎం బాలికల ఉన్నత పాఠశాల, నక్కావారి పేట నరసాపురం మహాత్మ జ్యోతిరావు పూలే వెనకబడిన తరగతుల సంక్షేమ బాలికల పాఠశాల, పెనుగొండ మండలం దేవ గ్రామం ఎస్ ఎం బి టి ఆర్ జెడ్పీ ఉన్నత పాఠశాలలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు వచ్చాయని తెలిపారు. అలాగే ప్రైవేటు పాఠశాలల్లో ఉల్లంపర్రు మాంటిస్సోరి స్కూల్, పెద అమిరం వెస్ట్ బెర్రీ హైస్కూల్, తాడేపల్లిగూడెం భాష్యం హైస్కూల్‌లకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు గెలుచుకున్నారన్నారు. వీటిలో ప్రథమ స్థానం సాధించిన రెండు పాఠశాలల విద్యార్థులు విశాఖపట్నంలో జరిగే రాష్ట్రస్థాయి చెకుముకి సైన్స్ సంబరాలకు ఎంపికయ్యారన్నారు. కార్యక్రమంలో పట్టణ ప్రముఖ వైద్యులు చల్లా మల్లికార్జునశర్మ, జనవిజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి జె.రామలక్ష్మణరావు, జిల్లా కన్వీనర్ రేపాక వెంకన్న బాబు, సభ్యులు టి.వెంకటేశ్వరరావు, పి.ధర్మారావు, ప్రత్తి వీరాస్వామి తదితరులు పాల్గొన్నారు.

అనుమతులు లేకుండా బాణసంచా విక్రయిస్తే చర్యలు


సీఐ కె రజనీకుమార్


దీపావళి బాణసంచా దుకాణం

పాలకొల్లు సెంట్రల్: అనుమతులులేకుండా ఎవ్వరైనా బాణసంచా మందులు తయారు చేసినా, నిల్వ చేసినా, విక్రయించినా కఠిన చర్యలు తప్పవని పట్టణ సిఐ కె రజనీకుమార్ హెచ్చరించారు. ఆదివారం దీపావళి బాణసంచా మందుల విక్రయదారులనుద్దేశించి కొన్ని సూచనలు చేశారు. ఈ సందర్భంగా సీఐ రజనీకుమార్ మాట్లాడుతూ అన్ని అనుమతులతో షాపులు నిర్వహించే వ్యాపారస్తులు తప్పనిసరిగా నిబంధనలు పాటించాలని అలాగే ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. బాణసంచా కాల్చే సమయంలోనూ తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. పండుగ సమయంలో కుటుంబ సభ్యులందరూ ఆనందోత్సాహాలతో ఉండాలంటే బాణసంచా కాల్చే సమయంలో నిత్యం అప్రమత్తంగా ఉండాలన్నారు. లైసెన్స్ ఉన్న వారు మాత్రమే బాణసంచా దుకాణాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. లైసెన్స్‌లు లేకుండా ఎవరైనా బాణసంచా వ్యాపారాలు కొనసాగిస్తే మాత్రం చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బాణసంచా విక్రయ, తయారీదారులు తమ పరిసరాల్లో ఇసుక, ఫైర్ సేఫ్టీసామగ్రి, వాటర్ వంటి నిబంధనలు తప్పనిసరిగా పాటించాలన్నారు. శాశ్వత, తాత్కాలిక లైసెన్స్ కలిగిన వారు మాత్రమే బాణసంచా విక్రయాలు చేయాలన్నారు. తాత్కాలిక లైసెన్స్ వ్యాపారులు బహిరంగ ప్రదేశాల్లో నిర్ణీత కొలతలు మేరకు ప్రత్యేక షెడ్లుల్లో ఎటువంటి ప్రమాదాలకు తావులేకుండా ఏర్పాటు చేసుకోవాలన్నారు. మైనర్లను బాణసంచా విక్రయాల వద్ద ఉంచరాదన్నారు. లైసెన్స్ కలిగిన విక్రయదారులు లైసెన్స్ లేనివారికి విక్రయించిన తద్వారా ఏదైనా ప్రమాదం జరిగినా దానికి లైసెన్స్‌దారుడే పూర్తి భాధ్యత వహించాలన్నారు. దుకాణాలు జనావాసాలకు, విద్యా సంస్థలకు, ఆసుపత్రులకు దూరంగా ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. నిబంధనలకు వ్యతిరేకంగా బాణసంచా విక్రయాలు, తయారీ చేయడం వంటివి చేస్తే బీఎన్ఎస్ చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దీపావళి రోజున ఏమైనా అవాంచనీయ సంఘటనలు జరిగినా అత్యవసర సమయంలో ఫైర్‌స్టేషన్ నెంబర్ 101, పోలీసు నెంబర్ 100 లేదా 112, 08814-222333లకు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలన్నారు.

ఆటోలతో ట్రాఫిక్ ఇబ్బందులు


మొగల్తూరురోడ్డులో నిలిపి ఉంచిన ఆటోలు

నరసాపురం: పట్టణంలో ఆటోల సమస్య నానాటికీ తీవ్ర మవుతోంది. ఆటోలను ఇష్టానుసారం రోడ్ల మీదే నిలిపి ఉంచడంతో ట్రాఫిక్ ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. మితిమీరిన వేగంతో ఆటోలను తిప్పడం, కనీస వయస్సు లేని చిన్న పిల్లలు కూడా ఆటో డ్రైవర్ల అవతారం ఎత్తడంతో ప్రతి రోజూ ఆటోల కారణంగా ఏవో ప్రమాదాలు జరగడం పరిపాటిగా మారింది. పట్టణంలో దాదాపు 400 పైగా ఆటోలున్నాయి. అయితే ఆటోలను నిలిపి ఉంచడానికి ప్రత్యేకంగా ఎక్కడా స్టాండ్స్ లేకపోవడం ఇబ్బందులను తెచ్చి పెడుతుంది. ఆటో డ్రైవర్ల ఎక్కడబడితే అక్కడ ఆటోలను నిలిపి ఉంచడంతో ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. ముఖ్యంగా బస్టాండ్, గుర్రపు బళ్ల స్టాండ్, ఎండుచేపల మార్కెట్ ప్రాంతాల్లో ఆటోల సమస్య ఎక్కువగా ఉంది. ఈ ప్రాంతాల్లో వందల కొద్దీ ఆటోలను రోడ్ల మీదే నిలిపి ఉంచుతున్నారు. రద్దీగా ఉండే బస్టాండ్, గుర్రపు బళ్ల స్టాండ్ వద్ద ఆటోలు కారణంగా ప్రమాదాలు ఎక్కువవుతున్నాయి. గడిచిన రెండేళ్లలో పట్టణంలో జరిగిన రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా ఈ రెండు ప్రాంతాల్లోనే జరగడం విశేషం. అసలే ఇరుకుగా ఉండే ఈ ప్రాంతాలు ఆటోలు ఇష్టానుసారం నిలిపి ఉంచడంతో పరిస్థితి మరింత ప్రమాదంగా మారింది. ఆటోలను నిలిపడమే కాకుండా, అక్కడ నుంచే జనాన్ని ఆటోలోకి ఎక్కించుకుంటున్నారు.

కానరాని చర్యలు

ఆటోలను మితిమీరిన వేగంతో తిప్పడం, పరిమితికి మించి జనాన్ని ఎక్కించుకోవడం సాధారణంగా మారిపోయింది. ఇక కనీస వయసు కూడా లేనివారు ఆటోలను నడుపుతూ ప్రమాదాలకు కారణమవుతున్నారు. ఆటోలపై దృష్టి పెడతామని, ఆటో డ్రైవర్లకు గుర్తింపు కార్డులిస్తామని, కనీస వయస్సు లేని వారు ఆటోలను నడపకుండా చర్యలు తీసుకుంటామని గతంలో ప్రకటించిన పోలీస్‌శాఖ ఆ విషయం పట్టించుకోవడం లేదు. అలాగే గడ్డిబజార్ సెంటర్, కనకదుర్గ ఆలయం వద్ద కూడా ఇష్టానుసారం ఆటోలు నిలుపుతుండడంతో స్థానికులు అనేక అవస్థలు పడుతున్నారు. ఇప్పటికైనా పోలీస్‌శాఖ దృష్టిపెట్టి ఆటోల సమస్యను పరిష్కరించాలని పట్టణ వాసులు కోరుతున్నారు.

పెనుమంట్రలో ధ్యాన శిక్షణ


ధ్యాన శిక్షణ ఇస్తున్న పిరమిడ్ మాస్టర్

పెనుమంట్ర: పెనుమంట్ర గ్రామంలో భూపతిరాజు శ్రీనివాసరాజు, సాయిగీత దంపతులచే నిర్మించిన బ్రహ్మర్షి పితామహ ధ్యాన మందిరం వద్ద భీమవరం పట్టణానికి చెందిన సీనియర్ పిరమిడ్ మాస్టర్ జి.శ్రీనివాసరావు పాల్గొని జ్ఞాన బోధ చేసి ధ్యాన శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ జీవితంలో దుఃఖరాహిత్య స్థితి పొందాలంటే బుద్ధని అష్టాంగ మార్గం పాటించాలన్నారు. పత్రీజీ ప్రబోధించిన శ్వాస మీద ధ్యాస ఉంచి ధ్యాన సాధన చేయాలన్నారు. కార్యక్రమంలో సుబ్బరాజు, మధు, సత్యవతి, తులసమ్మ, రమ, మంతెన లక్ష్మి పాల్గొన్నారు.

కవి కోలాటికి కవి సంధ్య ప్రతిభా పురస్కారం


కవి కోలాటి చినపెద్దిరాజును సత్కరిస్తున్న దృశ్యం

పాలకొల్లు అర్బన్: అంబేడ్కర్ సాహితీ వేత్త, కవి కోలాటి చినపెద్దిరాజును కవి సంధ్య సాహితీ సాంస్కృతిక సంస్థ (యానాం) కవితా పురస్కారాన్ని అందజేసిందని ఆదివారం పెద్దిరాజు విలేకరులకు తెలిపారు. పాండిచ్చేరి అధికార ప్రతినిధి మల్లాడి కృష్ణారావు, డాక్టర్ శిఖామణి చేతుల మీదుగా యానాం గీతాభవన్ అందుకున్నట్లు తెలిపారు. ప్రతిభా పురస్కారంతో పాటు నగదు, మెమెంట్లో, శాలువాతో సత్కరించారన్నారు.

కళాకారుల సంఘం సేవలు అభినందనీయం

తాడేపల్లిగూడెం (టీఓసీ): రంగస్థల కళాకారుల సంఘం సేవలు అభినందనీయమని పలువురు కళాకారులు కొనియాడారు. 149వ నెలవారీ సంఘ సమావేశం పట్టణంలో ఆదివారం రాత్రి 3వ వార్డు వీకర్స్ కాలనీ అర్బన్ హెల్త్ సెంటర్ సమీపంలోని నాన్న మునిసిపల్ కళ్యాణ మండపంలో నిర్వహించారు. సంఘం అధ్యక్షుడు సూరంపూడి వెంకట రమణ అధ్యక్షత వహించారు. దశిక శ్రీనివాస్ జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా సంగీత కచేరి నిర్వహించారు. మాజీ సైనిక ఉద్యోగి తానింకి శ్రీహరికి గౌరవ సత్కారం, కళాకారుడు ఈవీ సత్యనారాయణకు కళా సత్కారం, లెక్చరర్ బైర్ల సురేంద్రకు ఉద్యోగ పురస్కారం, హరికథ కళాకారిణి శ్రీవాణి (దువ్వ)కు ఆర్థిక సత్కారం చేశారు.

వృద్ధులకు దుస్తుల పంపిణీ


నేరేడుమిల్లిలో వృద్ధులకు దుస్తులు పంపిణీ చేస్తున్న మానవత సభ్యులు

యలమంచిలి: మానవత స్వచ్ఛంద సేవా సంస్థ భీమవరం మండల శాఖ ఆధ్వర్యంలో యలమంచిలి మండలం నేరేడుమిల్లి గ్రామంలో దీపావళి పండుగ పురస్కరించుకుని ఆదివారం 130 మంది పేద కుటుంబాలకు దుస్తులు పంపిణీ చేశారు. బుద్ధరాజు సూర్యనారాయణరాజు జ్ఞాపకార్థం ఆయన కుమారుడు, మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ భీమవరం శాఖ చైర్మన్ బుద్ధరాజు వెంకటపతి రాజు సౌజన్యంతో ఈ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ గోపిరాజు, డాక్టర్ దీప్తి మానవత సంస్థ ఉపాధ్యక్షులు కేవీఎస్ఎన్ రాజు, కారుమూరి నరసింహమూర్తి (బాబు), డైరెక్టర్ ఇందుకూరి ప్రసాదరాజు, కోశాధికారి గ్రంధి కుమార వరప్రసాద్, యలమంచిలి మండలం మానవతా సంస్థ అధ్యక్షులు దేగల వెంకటేశ్వరరావు, అల్లు శ్రీనివాస్, సీహెచ్ రామకృష్ణంరాజు పాల్గొన్నారు.

విద్యార్థికి ప్రతిభా పురస్కారం అందజేత

తణుకు టౌన్: పీజీ సెట్ 2024 ఎమ్మెస్సీ స్టాటిస్టిక్ సబ్జెక్ట్‌లో 20వ ర్యాంక్ సాధించిన విద్యార్థిని పొట్నూరి సూర్య ప్రభకు తణుకు మానవత సంస్థ రూ.25 వేల ప్రతిభా పురస్కారం అందజేసినట్లు తణుకు మానవత సంస్థ అధ్యక్షురాలు కఠారి శారదాదేవి తెలిపారు. ఆదివారం తణుకు రోటరీ క్లబ్ ఆడిటోరియంలో నిర్వహించిన మానవత సంస్థ సర్వసభ్య సమావేశానికి ఆమె అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ నెలలో మానవత సంస్థ చేపట్టిన సేవా కార్యక్రమాలను వివరించారు. కార్యక్రమంలో సూర్య ప్రభకు ప్రతిభా పురస్కారం అందజేశారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్టాపనోత్సవాలు


విగ్రహ ప్రతిష్టాపన పూజలు చేస్తున్న దృశ్యం

నరసాపురం రూరల్: మండలంలోని కొప్పర్రు గ్రామంలో శ్రీ సీతారామ లక్ష్మణ ఆంజనేయ వినాయక స్వామి వార్ల విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవ కార్యక్రమం ఆదివారం ఘనంగా నిర్వహించారు. పరిసర గ్రామాల నుండీ అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చారు. రామ నామ స్మరణతో కొప్పర్రు గ్రామం మార్మోగింది. అనంతరం భారీ అన్న సమారాధన నిర్వహించారు. నిర్వాహకులు సవరం సత్యనారాయణ, ధర్మరాజు దంపతులను పలువురు అభినందించారు. కార్యక్రమంలో తొలుత విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, ప్రధాన హోమాలు, రత్నన్యాసం, ధాతున్యాసం, భీజన్యాసం, యంత్రస్థాపన కార్యక్రమంలో నిర్వహించారు. అనంతరం శిలా విగ్రహ ప్రతిష్ఠలో భాగంగా మహాపూర్ణాహుతి, కుంభ కళా వాహన, గోదర్శన, కుంభప్రోక్షణ, శాంతి కల్యాణం వంటి వైదిక కార్యక్రమాలు నిర్వహించారు. పోలిశెట్టి సీతారామయ్య, పోలిశెట్టి శ్రీనివాసరావు (నాని), చినిమిల్లి సత్యనారాయణ, రావి బ్రహ్మాజీ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన


ఆగర్తిపాలెంలో సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న మంత్రి నిమ్మల రామానాయుడు

పాలకొల్లు అర్బన్: మండలంలోని ఆగర్రు, ఆగర్తిపాలెం గ్రామాల్లో రూ.1.13 కోట్లతో నిర్మించనున్న పలు అభివృద్ధి పనులకు రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ఆదివారం శంకుస్థాపన చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత గ్రామాల్లో అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయని మంత్రి నిమ్మల చెప్పారు. అలాగే మంత్రి క్యాంపు కార్యాలయంలో 11 మందికి రూ.3.20లక్షల విలువైన సీఎం సహాయ నిధి చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ చిట్టూరి కనకలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు నడపన గోవిందరాజుల నాయుడు, సర్పంచ్‌లు కావలి సూర్యకుమారి, కోడి విజయ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

కుల గణన చేపట్టాలి

ఇరగవరం: రాష్ట్రంలో నూతనంగా ఏర్పడిన ప్రభుత్వం జనగణనలో సమగ్ర కుల గణన వెంటనే చేపట్టాలని, స్థానిక సంస్థలలో రిజర్వేషన్ 44 శాతానికి పెంచాలని జాతీయ బీసీ ప్రజా సంక్షేమ సంఘంజాతీయ అధ్యక్షుడు గూడూరి వెంకటేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం ఇరగవరంలో జరిగిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ బీసీలు అనేక సంవత్సరాలుగా విద్య, ఉద్యోగ, రాజకీయాల్లో అగ్ర వర్ణాలతో సమానంగా ఎదగాలని, బీసీ సంఘాలు పోరాటం చేస్తున్నాయన్నారు. ఈ సందర్భంగా తణుకు నియోజకవర్గ అధ్యక్షుడిగా గుత్తుల తులసిగిరి, ఇరగవరం మండల అధ్యక్షుడిగా బొల్లా రాము నియమించారు

క్లుప్తంగా

ముత్యాలమ్మ ఆలయంలో భక్తుల రద్దీ


ముత్యాలమ్మను దర్శించుకుంటున్న భక్తులు

మొగల్తూరు: మండలంలోని ముత్యాలపల్లి ఉన్న బండి ముత్యాలమ్మను దర్శించుకునేందుకు ఆదివారం భక్తులు భారీగా తరలి వచ్చారు. జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి తరలి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని తమ మొక్కులు తీర్చుకున్నారు. మండలంలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అయ్యప్ప మాలదారులు కూడా అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా ఆలయ ఈఓ ఎం.అరుణ్ కుమార్, ఆలయ చైర్మన్ కడలి మాణిక్యాలరావు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఘనంగా ముత్యాలమ్మ జాతర


ఆచంటలో ముత్యాలమ్మ జాతరలో కాళికా నృత్యాలు

పెనుగొండ: ఆచంట గ్రామ దేవతలు ముత్యాలమ్మ, గోగులమ్మ అమ్మవార్ల జాతర మహోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. శనివారం రాత్రి తెల్లవార్లూ ఆచంట వీధుల్లో జాతర గ్రామోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు గరగ నృత్యాలు ఆకట్టుకొన్నాయి. బుట్ట బొమ్మలు, తీన్‌మార్ వాయిద్యాలు, బాణసంచా కాల్పులు తో హోరెత్తించారు. ఆదివారం అమ్మవారిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. జాతర మహోత్సవానికి భక్తులకు ఇబ్బందులు రాకుండా ఆలయాధికారి ఆదిమూలం వెంకట సత్యనారాయణ ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

'ఎంతపని చేశావ్ చంటి' చిత్ర యూనిట్ సందడి


కనకదుర్గ థియేటర్‌లో నటీనటులు

నరసాపురం రూరల్: నరసాపురంలో 'ఎంతపని చేశావ్ చంటి' చిత్ర యూనిట్ సభ్యులు ఆదివారం సందడి చేశారు. స్థానిక కనకదుర్గ థియేటర్‌లో ఈ చిత్రం ప్రదర్శితమవుతోంది. ఉదయం ఆట సమయంలో ఎంతపని చేశావ్ చంటి చిత్రంలోని హీరో, హీరోయిన్లు ప్రేక్షకులను ఉత్సాహపరిచారు. నరసాపురం మండలంలోని వేములదీవి గ్రామానికి చెందిన ఉలిశెట్టి శ్రీనివాస్ హీరోగా నటించారు. ప్రేక్షకులను సినిమా డైలాగులు చెప్పి అలరించారు. హీరో శ్రీనివాస్ ఉలిశెట్టి, హీరోయిన్లు శాంతి ప్రియ, నిహారిక, దర్శకుడు ఉదయకుమార్, ఇతర నటీనటులు, ప్రేక్షకులతో కలసి సినిమా వీక్షించారు.

ఏపీఎస్ఈబీ ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ కార్యవర్గం ఎంపిక


డీఈ మధుకుమార్‌తో నూతన కార్యవర్గ సభ్యులు

పాలకొల్లు సెంట్రల్: నరసాపురం డివిజన్ ఏపీఎస్ఈబి (విద్యుత్ శాఖ) ఎస్సీ, ఎస్టీ వెల్ఫేర్ ఎంప్లాయిస్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఎంపిక చేసినట్లు రీజనల్ సెక్రటరీ నీతిపూడి వెంకట్రావు ఆదివారం తెలిపారు. డివిజన్ అధ్యక్షుడిగా బి.నరేంద్ర శ్రీనివాస్, కార్యదర్శిగా కె.సురేష్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా వై.ప్రభాకర్, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా కె.వెంకటేశ్వరరావు, ట్రెజరర్‌గా కె.నాని, కమ్యూనికేషన్ కార్యదర్శిగా వై.నారాయణరావులతో పాటు నలుగురు కార్యవర్గ సభ్యులుగా ఎంపికచేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గ సభ్యులు డివిజనల్ ఇంజినీర్ కొల్లాబత్తుల మధుకుమార్‌ను మర్యాదపూర్వకంగాకలిశారు.

ఎస్సీలపై దాడులను ఐక్యంగా ఎదుర్కోవాలి

అత్తిలి: ఎస్సీలపై జరుగుతున్న దాడులను ఐక్యతతో ఎదుర్కొనాలని దళిత ఐక్య వేదిక నియోజకవర్గ నాయకుడు గంజి మధు అన్నారు. ఆదివారం సాయంత్రం అత్తిలి సీపీఎం కార్యాలయంలో దళిత ఐక్యవేదిక సమావేశం ఆయన అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా గంజి మధు మాట్లాడుతూ గత కొద్దిరోజులుగా ఎస్సీలపై వరుస దాడులు జరుగుతున్నాయని, భవిష్యత్‌లో ఇలాంటివి పునరావృతం కాకుండా ఉండాలంటే అంతా కలిసికట్టుగా ఉండాలని పిలుపునిచ్చారు. ఎస్సీల రిజర్వేషన్‌లు కాపాడుకోవడం కోసం, ఎస్సీలలో ఐక్యత నింపడం కోసం గ్రామ స్థాయి నుంచి నిర్మాణం చేయాలని సమావేశంలో ఏకగ్రీవంగా తీర్మానించారు. అత్తిలి మండల ఐక్య కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.